క్లుప్తంగా

రేపు వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమాలు

భీమడోలు: మహా నేత వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి కార్యక్రమాలను వైఎస్సార్ విగ్రహాల వద్ద ఈ నెల 2వ తేదీ మంగళవారం నిర్వహించాలని మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు రావిపాటి సత్యశ్రీనివాస్, మండల ఉపాధ్యక్షుడు రామకుర్తి నాగేశ్వరరావు ఆదివారం రాత్రి కోరారు. గ్రామ గ్రామాన వర్ధంతి కార్యక్రమాలను ఘనంగా నిర్వహించేలా వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ఏర్పాట్లు చేశారన్నారు. భీమడోలులో సర్పంచ్ పాము సునీతా మాన్‌సింగ్ క్యాంపు కార్యాలయంలో ఉదయం 9 గంటలకు వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, వైఎస్సార్ సీపీ శ్రేణులు హాజరు కావాలని వారు కోరారు.

కులవివక్షకు పాల్పడితే కఠిన చర్యలు


కార్యక్రమంలో మాట్లాడుతున్న మంగరాజు

గణపవరం: అన్ని వర్గాల ప్రజలు సమానమని, అందరూ కలిసిమెలిసి జీవించాలని, ఎవరైనా కులవివక్షకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్సీ, ఎస్టీ సెల్ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు చీకటిమిల్లి మంగరాజు అన్నారు. ఆదివారం గణపవరం మండలం వెలగపల్లి గ్రామంలో డిప్యూటీ తహసీల్దార్ అధ్యక్షతన సివిల్ రైట్స్ డే నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న మంగరాజు మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీలను కులం పేరుతో దూషించినా, కించపరిచినా అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. పౌరహక్కుల కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు పాల్గొనేలా ఆదేశాలు ఇవ్వాలని జిల్లా కలెక్టర్‌కు విజ్ఞప్తి చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన నర్సింగ్ విద్యార్థులు


మొక్కలు నాటుతున్న నర్సింగ్ విద్యార్థులు

దెందులూరు: బీఆర్‌డీ నర్సింగ్ కళాశాల కరస్పాండెంట్ సిద్దిశెట్టి నూకరాజు ఆధ్వర్యంలో ఆదివారం నర్సింగ్ విద్యార్థులు మొక్కలు నాటారు. కరస్పాండెంట్ నూకరాజు మాట్లాడుతూ ఈ మొక్కలను సంరక్షించే బాధ్యత కూడా తమదేనని, వాటికి త్వరలోనే ట్రీ గార్డులు ఏర్పాటు చేస్తామని అన్నారు.

ఘనంగా మద్ది రావమ్మ సంబరాలు


అమ్మవారి సంబరాలు నిర్వహిస్తున్న గ్రామస్తులు

దెందులూరు: దెందులూరులో శ్రీమద్ది రావమ్మ సంబరాలు ఆదివారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఐదు సంవత్సరాలకు ఒకసారి నిర్వహించే శ్రీమద్దిరావమ్మ సంబరాలు ఐదు వారాల పాటు జరుగుతాయని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. సంబరాల్లో భాగంగా ఆదివారం గ్రామంలో అనేక గ్రామాల నుంచి తరలి వచ్చిన భక్తులు, పలు ఆలయాల కమిటీలు, దెందులూరు గణాచార్యులు, పండితులు, గ్రామస్తుల నడుమ కనకనలాడే నిప్పుల అగ్ని గుండం తొక్కి భక్తిని చాటుకుంటారు.

గ్రామీణ ప్రాంతాలకు మానవత సేవలు


కార్యక్రమంలో పాల్గొన్న మానవత సభ్యులు

గణపవరం(నిడమర్రు): మానవత సంస్థ సేవలు మారుమూల గ్రామీణ ప్రాంతాలకు విస్తరించాలన్న లక్ష్యంతో పని చేస్తున్నట్లు సంస్థ జిల్లా అధ్యక్షుడు కె.సూర్యనారాయణ అన్నారు. ఆదివారం నిడమర్రు మండల మానవత సమావేశం వన్నెంరెడ్డి పరమేశ్ అధ్యక్షతన అడవికొలనులో నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ మానవత సంస్థ ఏర్పడిన అనతి కాలంలోనే దాతలు, స్వచ్ఛంద కార్యకర్తల సహకారంతో అగ్రగామి సేవా సంస్థగా ఎదిగిందన్నారు. కార్యక్రమంలో మానవత సభ్యులు సాగిరాజు జానకిరామరాజు, సత్యకుమార్, సాంబమూర్తి పాల్గొన్నారు.

శిరోమణికి నివాళి

ఉంగుటూరు: మానవత మూర్తి డాక్టర్ నాగశిరోమణి ఉంగుటూరు గ్రామానికి అందించిన సేవలు మరవలేనివని పలువురు వక్తలు అన్నారు. ఆదివారం ఉంగుటూరులో నిర్వహించిన మానవత మండల సమావేశంలో డాక్టర్ నాగశిరోమణి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

రొయ్య రైతులు ఉక్కిరిబిక్కిరి

- వైట్‌స్పాట్, విబ్రియో వ్యాధుల విజృంభణ
- క్షణాల్లో ఖాళీ అవుతున్న రొయ్యల చెరువులు


రొయ్యల చెరువుల్లో తిరుగుతున్న ఏరియేటర్లు

గణపవరం: ఈ ఏడాది రొయ్య రైతులకు కాలం కలిసి రాలేదు. వారి పరిస్థితి దెబ్బ మీద దెబ్బ అన్నట్లుంది. రెండు వారాల వ్యవధిలోనే కురిసిన భారీ వర్షాలు, అల్పపీడన ప్రభావం, ఆకాశం మేఘావృతమై వాతావరణం పూర్తిగా చల్లబడటంతో రొయ్య సాగుకు గండంగా పరిణమించింది. కలిసిరాని వాతావరణంలో వైరస్ వ్యాధులు ముప్పేట దాడి చేయడంతో వందల ఎకరాల్లో రొయ్యల చెరువులు ఖాళీ అయ్యాయి. సీడ్ వేసి నెల రోజులు కావడంతో కనీసం పెట్టుబడి కూడా దక్కడం లేదు. ప్రస్తుత వాతావరణం వైరస్ వ్యాధుల వ్యాప్తికి అనుకూలంగా మారడంతో విబ్రియో వైరస్, వైట్‌స్పాట్ వ్యాధులు విజృంభించాయి. జిల్లా వ్యాప్తంగా వారం రోజులుగా 200 నుంచి 300 కౌంట్‌లో ఉన్న వేలాది ఎకరాల్లో రొయ్యలు అకస్మాత్తుగా పట్టేశారు. చెరువుల్లో సీడ్‌వేసి నెల రోజుల లోపే కావడంతో రొయ్య సైజు బాగా తక్కువగా ఉంది. 200 కౌంట్‌లో ఉన్న రొయ్య ధర కిలో రూ.100 నుంచి రూ.110 వరకూ ఉండగా, ఒకేసారి పెద్ద ఎత్తున ఈ కౌంట్ ఉన్న రొయ్యలు పట్టుబడి చేయడంతో వ్యాపారులు కిలోకు రూ.15 వరకూ తగ్గించేశారు. దీంతో ఎకరాకు లక్ష వరకూ నష్టం వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక 200 పైబడి కౌంట్ ఉన్న రొయ్య కొనే నాథుడు లేడు. గణపవరం, నిడమర్రు మండలాల పరిధిలో వైరస్ వ్యాపించడంతో గత నాలుగు రోజుల్లో దాదాపు వెయ్యి ఎకరాల్లో రొయ్యలు పట్టేశారు.

నష్టాల్లో రొయ్య రైతులు

జనవరి నుంచి ఇప్పటి వరకూ రొయ్య రైతులు రూపాయి లాభం ఎరుగరు సరికదా లక్షల్లో నష్టాలు చవిచూస్తున్నారు. వాతావరణంలో తీవ్రమైన మార్పులు, అకాల వర్షాలు, విపరీతమైన ఎండలు, వ్యాధుల వ్యాప్తి ఈ ఏడాది ఆక్వా సాగును అతలాకుతలం చేశాయి. ముఖ్యంగా వైరస్ వ్యాధులు ముప్పేట దాడి చేస్తూ ఆక్వా సాగుకు గండంగా మారాయి. వారం రోజుల నుంచి భారీ వర్షాలు, చల్లబడిన వాతావరణం కూడా ఆక్వా సాగుకు ప్రతికూలంగా మారింది. చెరువుల్లో నీటి ఉష్ణోగ్రతలు బాగా తక్కువగా ఉండటంతో రొయ్యలకు ఆక్సిజన్ అందడం లేదు. దీంతో రైతులు ఆక్సిజన్ స్థాయిని పెంచడానికి నిరంతరం ఏరియేటర్లు తిప్పుతున్నారు. చల్లని వాతావరణంలో వారం రోజులుగా వైరస్ కూడా విజృంభించడంతో రొయ్య రైతులు బెంబేలెత్తిపోతున్నారు. ఒక ఆయకట్టులో ఒక చెరువులో వైరస్ వ్యాధి కనిపిస్తే తెల్లారేసరికి ఆ ఆయకట్టులో ఉన్న అన్ని చెరువులకు వ్యాపిస్తుంది. చెరువుల్లో రొయ్య సీడ్ వేసి నెల రోజుల లోపే కావడంతో కనీసం పెట్టుబడి కూడా రావడం లేదు. రొయ్య సైజు మరీ చిన్నగా అంటే 250 నుంచి 300 కౌంట్ రొయ్యలు పట్టుబడి చేసినా కనీసం వల ఖర్చులు కూడా రావన్న ఉద్దేశ్యంతో రైతులు రొయ్యలు పట్టకుండా చెరువుల్లో బ్లీచింగ్ కలిపి వదిలేస్తున్నారు.

సీడ్ నాణ్యత లోపంతోనే వైరస్



రొయ్య సాగులో సీడ్ నాణ్యత ముఖ్యం. సీడ్‌లో నాణ్యత లేకపోవడం వల్లనే వైరస్ వ్యాధులకు కారణం. ప్రస్తుత వాతావరణంలో వైరస్ వ్యాధుల దాడి తీవ్రంగా ఉంది. ఈ వైరస్ వ్యాధుల నివారణకు ప్రత్యేక చర్యలంటూ ఏమీ లేవు. చెరువులు పట్టివేస్తే శుభ్రం చేసి పూర్తిగా ఆరగట్టి నవంబర్ తరువాత చెరువులో సీడ్ వేసుకోవాలి. కోస్టల్ ఆక్వా కల్చర్ అథారిటీ సూచించిన సఫారీ రిజిస్ట్రేషన్ ఉన్న హేచరీలకు చెందిన సీడ్ మాత్రమే వేసుకోవాలి.

– సి.భాస్కర్, ఫిషరీస్ సహాయకుడు, కళ్లిగొట్ల


అర్ధంతరంగా పట్టివేసిన తక్కువ కౌంట్ రొయ్యలు


బ్లీచింగ్ చల్లి ఎండబెట్టిన రొయ్యల చెరువు

ఉద్యాన పంటలకు రాయితీ

ఉంగుటూరు: ఉద్యాన వన తోటలు వేసుకునే రైతులకు ప్రభుత్వం 40 శాతం రాయితీ అందిస్తోందని మండల ఉద్యానవన శాఖ అధికారి అమరనాథ్ వెల్లడించారు. మామిడి తోటలకు ఎకరాకు రూ.50 వేలు రాయితీ కల్పిస్తారని, మొదటి సంవత్సరం రూ.30 వేలు, రెండో సంవత్సరం రూ.20 వేలు అందజేస్తారని తెలిపారు. ఒక రైతు రెండున్నర హెక్టార్ల వరకు పరిమితమని చెప్పారు. జామకు రూ.80 వేలు, నిమ్మకు రూ.50 వేలు, కోకో పంటకు రూ.30 వేలు, సీతాఫలానికి రూ.30 వేలు, టీసీ అరటికి రూ.70 వేలు, బొప్పాయికి రూ.30 వేలు, డ్రాగన్ పంటకు రూ.2.70 లక్షలు, వాక్కాయకు రూ.30 వేలు చొప్పున రాయితీ రెండేళ్లలో అందిస్తారని ఆయన తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

గణపవరం: నిడమర్రు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో కొత్త విద్యుత్ లైన్ పనుల నిమిత్తం ఈ నెల 1వ తేదీ సోమవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏఈ తెలిపారు. నిడమర్రు, గుణపర్రు, కంద్రిక, పెదనింద్రకొలను, చిననింద్రకొలను, బైనేపల్లి, తోకలపల్లి, ఆముదాలపల్లి, డి.గోపవరం, అడవికొలను, ఇందిరా కాలనీ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఆయన తెలిపారు.

ఉంగుటూరులో..

ఉంగుటూరు: నారాయణపురం సబ్‌స్టేషన్ నుంచి నిడమర్రు సబ్‌స్టేషన్ ఆర్‌డీఎస్ పనులు చేపట్టనున్నారు. ఈ పనుల నిమిత్తం సోమవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని డీఈ అంబేడ్కర్ తెలిపారు. బాదంపూడి రూరల్ ఫీడర్‌లో రాచూరు, రావులలపర్రు, సీతారామపురం గ్రామాలకు, చేపల చెరువులకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు.

వైభవోపేతంగా వారాల పండుగ


అమ్మవారిని ఊరేగిస్తున్న భక్తులు


ఆకట్టుకున్న విచిత్ర శక్తి వేషాలు

భీమడోలు: గుండుగొలను, భీమడోలు, కురెళ్లగూడెం గ్రామాల్లో ఆదివారం వారాల పండుగను భక్తులు ఘనంగా నిర్వహించారు. ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో గంగానమ్మ (కనకదుర్గమ్మ) భారీ ప్రతిమలను విశేషంగా అలంకరించి ముస్తాబు చేశారు. అమ్మవారిని పురవీధుల్లో ఊరేగించారు. రాష్ట్ర అప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు గుండుగొలనులోని గంగానమ్మను దర్శించుకుని పూజలు చేశారు. గంగానమ్మకు ప్రజలు ప్రతి ఏటా వినాయక చవితి తరువాత వచ్చే ఆదివారం వారాల పండుగను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. దీంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. శక్తి వేషాలు, గరగ నృత్యాలు, కోలాటం తదితర నృత్య ప్రదర్శలు ఆకట్టుకున్నాయి.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం


భగవద్గీత ప్రచారం చేస్తున్న హిందూ జ్ఞాన వేదిక సభ్యులు

పెదవేగి: శ్రీకృష్ణ భగవానుడికి మాత్రమే ఊరేగింపు చేయాలని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞాన వేదిక నూజివీడు కమిటీ అధ్యక్షుడు అరుణ్‌కుమార్ అన్నారు. త్రైత సిద్ధాంత ఆదికర్త శ్రీఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల దివ్య ఆశీస్సులతో ఆదివారం ఏలూరు జిల్లా, పెదవేగి మండలంలోని అంకన్నగూడెం గ్రామంలో త్రైత సిద్ధాంత ఆధ్యాత్మిక గ్రంథాల హిందూ ధర్మ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా హిందూ జ్ఞాన వేదిక నూజివీడు అధ్యక్షుడు మాట్లాడుతూ దేవుడే ఒక మనిషిగా జన్మిస్తే ఆయనను భగవంతుడు అంటారని, అలాంటి భగవంతుడే శ్రీకృష్ణుడు, ఆయనను మాత్రమే అందరూ దైవంగా గుర్తించాలని అన్నారు. పూర్వం శ్రీకృష్ణాష్టమి 11 రోజుల పాటు చేసేవారు చివరిగా చవితి రోజున ఊరేగింపు చేసి ముగించేవారని ప్రబోధ సేవా సమితి సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో కోటేశ్వరరావు, వంశీ, రామాంజనేయులు, శేఖరరావు, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్య సాధనకు ఇష్టంతో చదవాలి


కార్యక్రమంలో పాల్గొన్న చిన్నారులు

భీమడోలు: విద్యార్థి దశ నుంచి తమ లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధనకు ఇష్టంతో చదవాలని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ జిల్లా కెరీర్ గైడెన్స్ డైరెక్టర్ తుమ్మల వెంకట ఉమామహేశ్వరరావు అన్నారు. భీమడోలు, పూళ్ల, గుండుగొలను శాఖా గ్రంథాలయాల్లో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమంలో భాగంగా జనరల్ నాలెడ్జ్, కరెంట్ ఎఫైర్స్, పుస్తక ప్రదర్శన వంటి కార్యక్రమాలను నిర్వహించారు. తమ లక్ష్య సాధనలో గ్రంథాలయాల పాత్రపై వారికి వివరించారు. గ్రంథాలయాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం పుస్తక ప్రదర్శన చేశారు. కార్యక్రమాల్లో గ్రంథపాలకులు డీఎస్‌బీ అమర్‌నాథ్, కె.శ్రీనివాసరావు, బంగారు పాప, ఉపాధ్యాయుడు మండే సుధాకర్, విద్యార్థులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో పశువైద్యశాల


శిథిలావస్థలో పశువైద్యశాల


భవనం శ్లాబ్ పెచ్చులు ఊడిపోయిన దృశ్యం

లింగపాలెం: ధర్మాజీగూడెం పశువైద్యశాల శిథిలావస్థకు చేరుకుంది. శ్లాబ్ పెచ్చులూ ఊడిపడడంతోపాటు వర్షం నీటితో మందులు, ఫైళ్లు, ఫర్నిచర్ తడిసిపోవడంతో సిబ్బంది, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మూడు మండలాల్లోని 15 పశు వైద్యశాలలకు కేంద్రంగా ఉన్న ధర్మాజీగూడెం ఏరియా పశువైద్యశాలలో సౌకర్యాలు లేకపోవడంతో అవస్థలు తప్పడం లేదు. ఈ ఆసుపత్రి భవనాన్ని 1977లో నిర్మించారు. భవనంలోని శ్లాబ్ పెచ్చులు, పెచ్చులుగా ఊడిపోతుంది. దీంతో వర్షం నీరంతా భవనంలోనే ఉంటుంది. ప్రస్తుతం పశువులు, గొర్రెలు, మేకలు, శునకాల సంఖ్య పెరగటంతో ఆసుపత్రి విస్తీర్ణం సరిపోవడం లేదు. ఏరియా హాస్పటల్ కావడంతో ఇక్కడ నుంచి కామవరపుకోట, ముసునూరు, లింగపాలెం మండలాల్లోని 15 హాస్పటల్స్‌కు మందులు పంపిణీ చేస్తున్నారు. మందులను నిల్వ ఉంచేందుకు భవనంలో సదుపాయాలు లేక సిబ్బంది అవస్థలు పడుతున్నారు.

అసంపూర్తిగా నూతన భవన నిర్మాణం

ధర్మాజీగూడెం పశు వైద్యశాల నూతన భవన నిర్మాణానికి 9 ఏళ్ల క్రితం నాబార్డ్ రూ.కోటి నిధులను మంజూరు చేసింది. భవన నిర్మాణ పనులు కూడా 75 శాతం పూర్తయ్యాయి. మిగిలిన పనులను పూర్తి చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో భవన నిర్మాణం పూర్తి కావడం లేదు. ఏళ్ల తరబడి భవన నిర్మాణం పూర్తికాకపోవడం, పాత భవనం శిథిలావస్థకు చేరడంతో పశువుల పెంపకందారులు, రైతులు, ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర గడిచినా ఈ భవన నిర్మాణం గురించి పట్టించుకోకపోవటంపై రైతులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అసంపూర్తిగా ఉన్న పశువైద్యశాల భవన నిర్మాణ పనులను పూర్తి చేసి పశువులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని రైతులు కోరుతున్నారు.

వెళ్లి రావయ్యా.. బొజ్జ గణపయ్య

వాడవాడలా గణేశుని నిమజ్జనాలు


భీమడోలు: ప్రత్యేక అలంకరణలో శ్రీమన్మహా గణనాథుడు


దెందులూరు: నిమజ్జనానికి గణనాథులను తీసుకెళుతున్న భక్తులు



ఉంగుటూరు: వినాయకుడిని ఊరేగిస్తున్న భక్తులు

భీమడోలు: మండల వ్యాప్తంగా వినాయక చవితి ఉత్సవాల ఐదో రోజైన ఆదివారం గణనాథుని ఊరేగింపులు, నిమజ్జనోత్సవాలు ఘనంగా నిర్వహించారు. భీమడోలు, ఎం.నాగులపల్లి, పోలసానిపల్లి, కొల్లేరు గ్రామాల్లో భక్తులతో పూజలందుకున్న లంబోదరుని ట్రాక్టర్లపై ఊరేగించారు. భీమడోలు గణపతి సెంటర్‌లో శ్రీమన్మహా గణనాథుని ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. స్వామి వారు భక్తులకు తెల్లటి పాలమీగడ వర్ణంలో దర్శనమిచ్చారు. తొమ్మిది రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాల్లో సంప్రదాయబద్ధంగా స్వామివారు ప్రతి రోజూ ఒక వర్ణంలో భక్తులకు దర్శమిస్తారు. భీమడోలు జంక్షన్‌లోని శ్రీహరినగర్ కాలనీలో వేంచేసియున్న శ్రీమహాలక్ష్మీ గణపతి స్వామి ఊరేగింపు, నిమజ్జనోత్సవం ఘనంగా నిర్వహించారు. భీమడోలు జంక్షన్‌లోని వినాయక ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని ఆలయ కమిటీ సభ్యులు భారీ అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు.

వైభవంగ గణేశుని ఊరేగింపు

దెందులూరు: భక్తి శ్రద్ధలతో నిమజ్జనాలు దెందులూరు వినాయక చవితి ఉత్సవాలు సందర్భంగా ఆదివారం దెందులూరులో నిమజ్జన కార్యక్రమాలు నిర్వహించారు. అందం వారి వీధిలో వినాయకుడి విగ్రహాన్ని, కాశీ కాలనీలో వినాయకుడి విగ్రహాన్ని ట్రాక్టర్‌పై ఉంచి గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. యువత మహిళలు మేళతాళాలతో రంగుల చిమ్ముకుంటూ ఉత్సాహంగా విగ్రహాల ముందు నృత్యాలు చేశారు. అనంతరం గోదావరి కాలువలో గణపతి బప్పా మోరియా అంటూ నిమజ్జనం చేశారు. అందం వారి వీధి, కాశీ కాలనీ విగ్రహాలు నిమజ్జనం సందర్భంగా గ్రామంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా దెందులూరు ఎస్సై రాజమల్లు శివాజీ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.


భీమడోలు: శ్రీహరినగర్‌లోని స్వామి వారిని ఊరేగిస్తున్న భక్తులు

టోలు ప్లాజా స్టాఫ్ ఆధ్వర్యంలో..

ఉంగుటూరు: ఉంగుటూరు టోలు ప్లాజా సిబ్బంది ఏర్పాటు చేసిన వినాయకుడిని ఆదివారం ఊరేగించారు. ఈ సందర్భంగా రంగులు పూసుకుని డ్యాన్సులు వేస్తూ ఊరేగింపులో టోలు ప్లాజా ఉద్యోగులు పాల్గొన్నారు. టోలు మేనేజర్ ఇంతియాజ్, టీఎంటీ మేనేజర్ రమేష్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. గోదావరి కాలువలో వినాయకుడిని నిమజ్జనం చేశారు.

గణపవరాన్ని ఏలూరులో కలపొద్దు

గణపవరం: గణపవరం మండలాన్ని పశ్చిమగోదావరి జిల్లాలోనే కొనసాగించాలని, ఏలూరు జిల్లాలో కలపొద్దని అఖిలపక్ష నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గణపవరం నుంచి అఖిలపక్ష నాయకులు ఆదివారం భీమవరం వెళ్లి డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణరాజు, ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులుకు వినతి పత్రాలు సమర్పించారు. అనంతరం కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మను కలిసి వినతిపత్రం సమర్పించారు. వినతి పత్రాలు ఇచ్చిన వారిలో పాతపాటి హరికుమార్‌రాజు, నంద్యాల రామలింగరాజు, ఇందుకూరి రామకృష్ణంరాజు తదితరులు ఉన్నారు.

గణపతి ఆలయాన్ని సందర్శించిన ఎస్పీ

కొయ్యలగూడెం: గణపతి యువజన సేవా సంఘం నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు ప్రశంసనీయమని ఎస్పీ కె ప్రతాప్ శివ కిషోర్ పేర్కొన్నారు. ఆదివారం గణేష్ సెంటర్ కి విచ్చేసిన సందర్భంగా నూతనంగా నిర్మించిన గణపతి ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. దాదాపు 80 సంవత్సరాల నుంచి గణపతి యువజన సేవా సంఘం ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తూనే గ్రామాభ్యుదయానికి రెండు కోట్ల రూపాయలకు పైగా విలువైన ఆస్తులను దానంగా ఇచ్చిందని ప్రశంసించారు. ఈ సందర్భంగా పాలకమండలి అధ్యక్షుడు మట్ట సూర్యచంద్రం మాట్లాడుతూ నూతన ఆలయ నిర్మాణానికి పోలీస్ శాఖ అందించిన కృషికి గ్రామస్తులు తరఫున కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ సంకుకొండ పాలకి, మండల సభ్యులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళాలు

కొయ్యలగూడెం: కొయ్యలగూడెంలోని తాడేపల్లిగూడెం రోడ్డులో నూతనంగా నిర్మిస్తున్న శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయానికి ఇప్పటివరకు రూ.35 లక్షల విరాళాల రూపంలో సమకూరినట్లు పాలకమండలి చైర్మన్ తాడికొండ మురళీకృష్ణ ఆదివారం పేర్కొన్నారు. సుమారు రూ.45 లక్షల అంచనాతో సింహపురి హోటల్స్ యజమాని ఎంవీఆర్ విరాళంగా ఇచ్చిన మూడున్నర సెంట్ల స్థలంలో నిర్మాణం కొనసాగుతుందన్నారు. ప్రస్తుతం గోపురం నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని నవంబర్‌లోగా నిర్మాణం పూర్తి చేసి సుబ్రహ్మణ్యషష్టి ఉత్సవానికి ప్రారంభోత్సవం చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో దాతలు, కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

మద్ది క్షేత్రంలో హనుమద్ హోమం

జంగారెడ్డిగూడెం: గుర్వాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి ఆలయంలో ఆదివారం హనుమద్ హోమం అర్చకులు, వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించినట్లు ఈవో ఆర్‌వీ చందన తెలిపారు. ప్రతి ఆదివారం హనుమద్ హోమ కార్యక్రమాన్ని ఆలయంలో నిర్వహిస్తున్నామని, భక్తులు సద్వినియోగం చేసుకుని స్వామివారి కృపను పొందాలని కోరారు. కార్యక్రమాన్ని ఆలయ పర్యవేక్షకులు రాజ్‌కుమార్ పర్యవేక్షించారు.